# బలీయసీ కేవల మీశ్వరాజ్ఞా

సీట్లో కూర్చుంటూనే టపాల్ చూసుకోవటం అలవాటు విజయ్‌కి. ఆఫీసుకి సంబంధించిన టపాల్ ఓ వేపూ, పర్సనల్ టపాల్ ఓ వేపూ విడి విడిగ పెడుతూ ఉండాలని ఛార్జీ తీసుకున్న మొదటిరోజే చెప్పాడతను. ప్యూన్ అక్షరాలా ఆచరణలో పెడుతున్నాడు దాన్ని.

ఆఫీస్ టపాల్‌ని ఓవారగా త్రోసి తనకు వచ్చిన జాబులు చూసుకోసాగాడు. నాన్నగారు ఉత్తరం వ్రాశారు పంపిన డబ్బు అందినట్లు, క్షేమ సమాచారాలు తెలపమంటూ, మరో వుత్తరం అభిమాన మాసపత్రిక భారతి ఆఫీస్ నుండి చందా ముగిసింది తిరిగి పంపమంటూ, మూడో ఉత్తరం కవర్, పై అక్షరాలు పరిచితంగానే ఉన్నా మామూలుగా వచ్చే ఉత్తరాలలోనిది కాదు. ఎంత ఆలోచించినా ఆ వుత్తరం వ్రాసిందెవరో తెలుసుకోలేక పోయాడు విజయ్. తర్వాత ఆలోచించిగానీ తెరవరాగనుకుని అటుగాపెట్టి నాలుగవ కవరు తీసుకున్నాడు.

అది బుక్‌పోస్టు కవరు. ఎవరో పంపిన పెళ్ళి పత్రిక. పూరకే అలా చూచి పక్కన పేద్దామనుకున్నాడు. వేసవి కాలంలో పెళ్ళిళ్ళకేం కొదవ ? అందునా అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉన్న వాడిపై బంధువులకి కూడా ప్రీతి ఎక్కువ. అనుకుని శుభలేఖ విప్పాడు.

పెళ్ళి పత్రిక తెరవగానే పెళ్ళి కొడుకు పేరు చూశాడు. అతనిలో కలిగిన ఆశ్చర్యం ఆనందం వర్ణించరానిది. తన ఫ్రెండ్.... తన క్లాస్‌మేట్... జగన్నాధం పెళ్ళి కొడుకవుతున్నాడు.

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు ?

"జీవితంలో అనుకున్నది సాధించాక కానీ పెళ్ళి చేసుకోనోయ్" అనేవాడు జగన్నాధం... చివరికి సాధించాడు. అనుకున్నట్టు పెళ్ళి చేసుకుంటున్నాడు.

"నేను ఫారిన్ డిగ్రీ అందుకోంది పెళ్ళి చేసుకోనోయ్. అమ్మాయి కనీసం ఫస్టుక్లాస్ డిగ్రీహోల్డరన్నా అయి ఉండాలి. డాక్టరవుతే యిబ్బందే లేదు" అనేవాడు ఎప్పుడూ.

అనుకున్నట్టుగానే మెడిసన్ పూర్తి చేస్తూనే స్కాలర్‌షిప్‌పై అమెరికా వెళ్ళాడు. న్యూయార్క్ నుండి వుత్తరాలు కూడా వ్రాస్తూ ఉండేవాడు. ఆరు నెలల క్రితం కాబోలు జాబు వచ్చింది. తనే జవాబు యివ్వటంలో ఫెయిలయ్యాడు. అంతే అతని నుండి జాబు లేదు మళ్ళీ ఇదో! యీ శుభలేఖ.

అక్షయ తూణీరం నుంచి బాణాలు వెలికి వచ్చినట్టుగా ఒకదాని వెంట ఒకటిగా జగన్నాథం గురించి ఆలోచనలు వస్తున్నాయి.

'ఎలాగయినా జగన్నాథం పెళ్ళికి వెళ్ళి తీరాలి' అనుకున్నాడు విజయ్. దాంతో అతనికి తన పెళ్ళినాటి సంఘటనలు ఒకటొకటే గుర్తుకి రాసాగాయి.

✧ ✧ ✧

విజయ్ తరపున చలాకీగా మాట్లాడే ఆడవాళ్ళు లేరు.

అందుకనే ఆ బాధ్యత అంతా తనపై వేసుకున్నాడు జగన్నాథం. మొదలే జగన్నాథం వసపిట్ట. అందునా తన పెళ్ళి !

'ఆగండి బాబాయిగారూ! అలా త్వరపడితే ఎలా ? ఈ పెళ్ళిళ్లే అంత ! అయినా మూడు వందల మైళ్ళు ప్రయాణం చేసిన వచ్చిన పెళ్ళి కొడుకుని నాలుగడుగులు ముందుకు రమ్మని అనకుంటే మన అమ్మాయిని కాస్త మూడడుగులు ముందుకు రమ్మనరాదా ?

అది ఎదుర్కోలు సమయం.

ఆ మాటకి పెళ్ళికూతురి అక్కగారు కాబోలు కలగజేసుకుని "బావుందబ్బాయ్. బావుంది. మున్నూరామడ నడచివచ్చినా ముందు మగవాడే రావాలన్నారు. మీ పెళ్ళికొడుకునే పెద్ద మనసు జేసుకుని నాలుగడుగులు నడవమనరాదూ' అంది జవాబుగా.

'మీ మాటనీ కాదనలేం అక్కయ్యగారూ! కానీ మావాడు పరమ సుకుమారుడు అనే మాట మరవకండి. బస్సులో అంతదూరం ప్రయాణం చేసి అలసిపోవటం అటుంచి బస్సు రోడ్డుని దిగి యీ నాలుగు మైళ్ళూ బళ్ళ బాటపై వచ్చినంత దూరమూ యమబాధ పడ్డాడు పాపం! ఖరదిమీద కాస్త దయ చూపి చెల్లెమ్మనే చొరవచేసి చెరి సగం దూరం నడిచేట్టయినా చెయ్యండి" అన్నాడు.

"మళ్ళీ భోజనాలకి ఆలస్యమవుతుందబ్బాయ్" అన్నాడో ముసలాయన, అన్నగత ప్రాణి.

'పెళ్ళన్నాక భోజనాలకి ఆలస్యం కాక పోతుందా పెద్దయ్యగారూ, రాత్రి భోజనాలు పండెండుకి పగటి భోజనాలు నాలుగింటికి అవుతేనే అది బ్రాహ్మల పెళ్ళి' అన్నాడు తపీమని జగన్నాథం.

అలా మాటకిమాట జవాబు చెపుతూ గలగలలాడుతూ కిలకిల నవ్విస్తూ ఎదుర్కోలు అంతా తనే అయిపోయాడు జగన్నాథం. అతని చొరవ ఆనందాన్ని కల్గిస్తే అతని మాటకారితనం హాయి కలిగించేది.

✧ ✧ ✧

"తలంబ్రాలు పడందే పెళ్ళికొడుకు అత్తవారింట్లో భోజనం చెయ్యకూడదు. విడిదింటికే భోజనం పంపిస్తాను' అన్నారు విజయ్ మామగారు.

'నో! నో! అలాంటి మూఢ విశ్వాసాలు నా ముందు పనికి రావు బాబాయ్‌గారూ! ఎప్పుడైతే ముహూర్తాలు నిశ్చయించుకున్నారో అప్పుడే మా విజయ్ 'కడు స్వతంత్రుడైనాడు' నలుగురిలో కూర్చుని హాయిగా భోజనం చేసే ఛాన్సు పోగొట్టకండి వాడికి' అన్నాడు జగన్నాథం కల్పించుకుంటూ.

విజయ్‌కి కూడా అతని మాటలు నచ్చాయ్.

ఇహ కాదనలేక అంగీకరించారు అందరూ.

భోజనాలవేళ అతని చమత్కారాలు మరీ మరీ అలరించాయ్.

పట్టుబట్ట కట్టుకుని వచ్చి 'బాబాయి గారూ నేనూ వడ్డిస్తా'నన్నాడు జగన్నాథం.

అందుకాయన కృతజ్ఞతగా నవ్వి "మాట చాలు బాబూ! నీకు శ్రమెందుకు? మేమంతాలేమూ? అన్నాడు.

'మీరంతా వున్నారనే నేనూ వచ్చింది బాబాయ్. మీ అల్లుడికి ఏమేం కావాలో తెలుసుకుని వడ్డించకపోతే రేపు చెల్లెలికి తను వడ్డించేస్తాడు.'

'అయినా వియ్యాలవారి తరపున వచ్చావు- నీకెందుకులే....' అనబోయాడాయన.

"ఆ మాట అన్నారంటే నేనూరుకోను బాబాయ్. నేను మీ తరపు వాడినే విజయ్‌కి నాకూ వరస. అసలు నేను ఆడపిల్లనై ఉంటే అతన్ని నేనే పెళ్ళి చేసుకునేదాన్ని...' అని మామిడికాయ ఊరగాయ అందుకుని వెళ్ళి వడ్డించి వచ్చాడు.

తర్వాత కూరగిన్నె తీసుకోబోతూ 'మే మిద్దరం చాలా అన్యోన్యంగా పెరిగాం బాబాయ్. మా స్నేహితాన్ని చుట్టరికంతో ముడివేసుకుందామనుకున్నాం. కానీ వెధవది యిద్దరికీ చెల్లెళ్ళు లేరు." అన్నాడు నవ్వుతూ.

ఇహ ఆయన జవాబు చెప్పలేదు.

"మగ పెళ్ళి వారికి స్పెషల్ ఎరేంజ్‌మెంట్స్, ఏం కావాలన్నా నన్నడగండి. కావలసింది వెయ్యకుండా, అక్కర్లేనిది అడుగుతూ వడ్డి-స్తాను' అన్నాడు నేతి జాడీ-చేతపట్టుకుని.

ఫక్కుమని నవ్వారు అందరూ.

'అయ్యో! భోజనాలవేళ నవ్వులు మంచివి కావు. సైన్స్ చెప్పిన మాట వినండి'

'ఏమిటో!'

'పొరపోతుందంటారు కదండీ! భోజనాలవే ళ మాటలాడటం కూడదు.'

మజ్జిగ తీసుకుని వస్తూ," అయ్యో చిక్క్‌ని మజ్జిగ! చి...క్క....ని.... మజ్జిగ' అన్నాడు సాధ్యమైనంత శ్లేషతో.

పంక్తి పంక్తి అంతా పగలబడి నవ్వింది.

"అయ్యో యిలా అందరూ ఒకేమారు నవరత్నాలు వొలకబోస్తే ఏరుకోవటం కష్టమండీ. వరుసగా ఛాన్స్ తీసుకోండి."

తాంబూలాలు అందిస్తూ 'ఆ కర్ణాయతలోచనలకి యిష్టమైన బంగారం లాటి ఆకులు. పూర్ణచంద్రవదనల పలువరసలా తెల్లనైన సున్నం! మీకిష్టమైన సుగంధ ద్రవ్యాలతో వక్కపొడి. ఆలపించిన ఆశాభంగం' అంటూ తెగనవ్వించాడు అందర్నీ.

✧ ✧ ✧

"శాస్త్రిగారూ! మా చెల్లాయి లక్ష కోట్ల వరహాలు. మీ వాడు చిల్లిగవ్వ... పొత్తు ఎలాగండీ?"

"ఒరే! ఒరే! నన్ను మరీ అలా తీసెయ్యకురా! మొదట్నించీ నువ్వు నా పార్టీ."

"అవుతే! ఇప్పుడు మాత్రం సమైక్య వాదుల్లా పార్టీ ఫిరాయించేశాను, నీ విలువ అంతే!"

చుట్టూతా ఉన్నవాళ్ళంతా ఫక్కున నవ్వేరు.

కాస్తసేపు గడిచాక "శాస్త్రిగారూ! ఇది మరీ అన్యాయమండీ! మా చెల్లాయి పప్పేనుగ అన్నారు. సరే ఒప్పుకున్నాం. వాడు ఉప్పేనుగ అన్నారు, అంగీకరించాం. కానీ యింత పప్పుకి అంత వుప్పు అక్కర్లేదండీ. ఉప్పెక్కువైనా అప్పెక్కువైనా భరించటం కష్టమట కదండీ' అన్నాడు మళ్ళీ.

పొలోమని నవ్వింది పెళ్ళిపందిరంతా!

✧ ✧ ✧

బువ్వపు బంతుల వేళ !

ఒరే అబ్బాయ్! ఈ భోజనాలు ఎందుకో తెలుసా ? ఈ రోజే కాదు జీవితాంతం నీవు నీ భార్యని కాదని ఏదీ తినరాదు. ప్రతిదీ సమంగా పంచుకుని తిను. ఇద్దరూ కలిసి తినండి, కలసి తిరగండి అని చెప్పటానికి తెలుసా ?'

'లేదు లేవోయ్! మాబాగా తెలుసు నీకు. చదువుకున్న ఆడవాళ్ళు మగని ఎంగిలి అసహ్యించుకుంటారేమోనని 'అమ్మాయ్! భర్త ఎంగిలి తినటంలో తప్పులేదు. మిగిలించింది పారవెయ్యవద్దు. ఆహార ధాన్యాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయ్. పొదుపు అవసరం అని చెప్పటానికే తెలుసా?' అన్నాడు విజయ్.

'ఐ.ఏ.యస్.లో అలా చెపుతారేమో నేనెరుగను. కానీ జీవితంలో ఆడదాన్ని కాదని వెళ్ళొద్దు. మగాడనే టెక్కు నీకొద్దు. భార్య మాట విను. అవసరమైతే సలహాకి సంప్రదించు అని. ఆడదానికి లొంగి ఉండాలని బోధించటానికి మగవాడికి పంక్తి భోజనం ఏర్పాటు చేశారు తెలుసా?' అన్నాడు నవ్వుతూ.

'ఓహో! నీ మెడిసన్‌లో అలా చెపుతున్నారేమోలే! నాకు తెలియదు' అన్నాడు విజయ్ బదులుగా.

అలా అన్నిటా తనే అయి తిరిగాడు జగన్నాధం.

చివరికి భోజనాలవేళ బుస్సపుబంతి పాట కూడా పాడాడు. గొంతు బాగుందని ఇంకోటి పాడమని అడిగారు అందరూ. 'సావిరహే తవదీనా రాధా' పాడాడు. 'భేష్! భేష్! అన్నారు అందరూ.

✧ ✧ ✧

గర్వించాడు విజయ్ అతని స్నేహితానికి.

✧ ✧ ✧

గడియారం టంగ్‌మనటంతో ఆలోచనలు ఆగిపోయాయి. కవరు చించి జగన్నాథం వ్రాసిన జాబు చదవసాగాడు విజయ్.

రేయ్! కలక్టరు బావా !

ఈనాటికి నేను పెళ్ళి చేసుకుంటున్నానురా ! నేను కోరినట్టుగా నా అభిరుచులకు తగిన అమ్మాయి ఈనాటికి దొరికింది. పెళ్ళికి చాలా ముందుగా జాబు వ్రాయాలనుకున్నా వీలు చిక్కింది కాదు. విశేషాలు అన్నీ సమక్షంలో చెప్తాను. డివిజన్ అధికారివనీ సెలవు పెట్టటానికి వీలుకాదనీ అనకుండా కనీసం వారంరోజులు సెలవు పెట్టి వెంటనే బయల్దేరి రా.

నీ రాకకై ఎదురు చూస్తూ

నీ

జగన్నాథం.

ఎంతో సుదీర్ఘమయినే పుత్తరం వ్రాసి వుంటాడనుకున్న విజయ్‌కి ముందు నిరాశ కలిగినా ఆ నాలుగు ముక్కలే ఆనందాన్ని కలిగించాయ్.

'పెళ్ళి యింకా రెండు రోజులుంది. కానీ యీ రోజు రాత్రికే బయలుదేరితే కానీ సకాలానికి చేరుకోవటం కష్టం' అనుకున్నాడు.

'సార్' అని పిలిచాడు సి.సి.

ఒక్కసారిగా బాహ్య స్మృతిలోకి వచ్చి 'కమిన్' అన్నాడు విజయ్.

తర్వాత రొటీన్‌గా కార్యక్రమాలు అన్నీ జరిగిపోయాయి.

ఎమర్జన్సీ క్రింద సెలవు పెట్టేసి వెళ్ళిపోయాడు విజయ్.

✧ ✧ ✧

విజయ్ ట్రయిన్ ఎక్కేవేళకు సూర్యుడు డ్యూటీ నుంచి సెలవు తీసుకుంటున్నాడు. మబ్బులు షికారుకి వచ్చిన ఆడపిల్లలా చెల్లాచెదరుగా ఆడుకుంటున్నాయ్.

ఫస్టుక్లాస్ కంపార్టుమెంట్ కావటంతో దాదాపు నిర్జనంగా ఉంది కంపార్టుమెంట్. ఆ చివర ఎవరో భార్యాభర్తలు పడుకుని నిద్రపట్టించుకోవటానికి మాట్లాడుకుంటున్నారు.

రీడర్స్ డైజస్ట్ తీసి చదవసాగాడు విజయ్.

గడియారంతో పాటు ట్రెయిన్ కూడా వేగంగా పరిగెడుతూ ఉండటంతో స్టేషన్స్ ఒక్కొక్కటే వెనకపడి పోతున్నాయ్. చదవటంలో నిమగ్నుడయిన విజయ్‌కి ఎంతదూరం

ప్రయాణించింది తెలియటం లేదు.

హెూరుమని గాలి వీచటంతో ఉలిక్కిపడ్డట్టయినాడు విజయ్.

కంపార్టుమెంటు డోర్ తెరవబోతే బుస్సుమని నాగుపాములా జల్లుతో కొట్టింది గాలి. ఒకడుగు వెనక్కి వేశాడు.

ఉధృతమైన గాలివాన.

ఆకాశమంతా మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయ్.

కళ్ళు చించుకున్నా ఏమీ కానరావటం లేదు.

తలుపు వేసాడు విజయ్.

ముఖంపై పడిన జల్లులు తుడుచుకుని బెర్త్‌పై కూర్చుంటూ వుస్సురని నిట్టూర్చాడు. ఆహ్వానంలేని చుట్టాల్లా పెళ్ళిళ్ళు కొస్తాయ్ వానలు అనుకున్నాడు విజయ్ భారమైన మనస్సుతో.

అతని మనస్సులాగే గాలివానలో భారంగా వెళుతోంది ట్రెయిన్.

రేణిగుంటలో ట్రెయిన్ ఆగినపుడు కొద్దిగా తలుపు తెరిచి చూశాడు మళ్ళీ. ప్లాట్‌ఫామ్‌పైన ఫ్లాప్ పిక్చర్‌కి రెండో వారంలో రెండో ఆటకి వచ్చినట్లుగా వున్నారు జనం.

పెళ్ళిళ్ళన్నీ ఎప్పుడూ వేసవికాలంలోనే ఉంటాయ్ సామాన్యంగా. వాటికి జతగా వర్షాలూ తప్పవు. 'నానవేసిన బియ్యం తింటే పెళ్ళిరోజు వాన వస్తుందిరా' అనేది అమ్మమ్మ చిన్నప్పుడు.

ఒకదానికొకటి సంబంధంలేని ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. ఎవరయినా కనిపిస్తే కాఫీయో టీయో త్రాగుదామని చూశాడు విజయ్. దాదాపు నాలుగు గంటలయిందేమో ప్యాసింజర్ల గతి పట్టించుకునే వాడేలేడు.

బరువుగా శరీరాన్ని యీడ్చుకుంటూ వెళ్లేవ్యక్తిలా బయల్దేరింది ట్రెయిన్.

ఆగుతూ సాగుతూ ఎదురైనా రైళ్ళకి దారియిస్తూ తీసుకుంటూ ఎలాగయితేనేం ఆరింటిలోగా మదరాసు చేరుకుంటుందన్న ట్రెయిన్ ఉదయం పదకొండు గంటలు దాటేవరకు చేరలేదు.

సెంట్రల్‌లో దిగేసరికి యింకా జోరుగా కురుస్తోంది వర్షం.

ఆ వర్షంలోనే గబగబా దిగివెళ్ళిపోతున్నారు ప్రయాణికులు.

తనలాగా పెళ్ళిళ్ళకి వెళ్లేవాళ్ళూ, కోర్టులకి వెళ్లేవాళ్ళూ, సినిమాల్లో చేరాలనుకుని వచ్చేవాళ్ళూ, స్మగుల్డ్ వ్యాపారం చేసే వాళ్ళూ, విద్యార్థులు, ఉద్యోగస్తులు రకరకాల జనం ఆదరబాదరగా ఆతురతతో వెళ్ళిపోతున్నారు.

గత్యంతరం లేక ట్రెయిన్ దిగి పోర్టర్ చేతికి లగేజ్ అందించి టికెట్ యిచ్చి ఎంక్వయిరీస్ వద్దకి వెళ్ళి కుంభకోణం వెళ్లే ట్రెయిన్ టైమింగ్స్ అడిగాడు.

మొదట చికాకుగా జవాబు యిచ్చినా సహజమయిన విజయ్ కలెక్టరు ఠీవికి జంకి కాబోలు మళ్ళీ చక్కగా జవాబు చెప్పాడు క్లర్క్. ఈ వర్షం వలన షెడ్యూల్డ్ టైమ్‌కి ఏ ట్రెయిన్ లేదు. అదయినా ఈ వర్షం తగ్గితేనే!

నిస్పృహతో నిరాశతో బయటికి వచ్చి టాక్సీలో కూర్చున్నాడు విజయ్.

లాడ్జిలో దిగి డ్రెస్ ఛేంజ్ చేసుకుని స్నానం చేసి భోజనం చేసేసరికి దాదాపు రెండయింది.

ఇలా యిక్కడ లాడ్జిలో కూర్చుని నిట్టూర్చుతూ నిరాశతో కొట్టుమిట్టాడుతూ వుండే దానికంటే ఏదయినా ప్రయత్నం చేద్దామని గదికి తాళం వేసి వచ్చాడు బయటికి.

మేనేజర్ వద్దకి వెళ్ళి హాల్లో కూర్చుని అడిగాడు.

"కుంభకోణం వెళ్ళటానికి ఏదయినా బస్‌వుందా?

"వుండొచ్చు సార్! కానీ వర్షం మూలంగా వెళతాయో వెళ్ళవో తెలీదు.

"పోనీ ఏదయినా కారో, టాక్సీయో......"

అతని ఆతురతకి అమాయకత్వానికి నవ్వుతోన్నట్టుగ "ఈ వర్షంలో కిరాయికి వచ్చేవాడెవడు సార్" అన్నాడు.

"పాడు వర్షం" తిట్టుకోబోయాడు విజయ్.

అతను ఇంకేదో అనబోతూ వుండగా "అబ్బబ్బ! అలా అనొద్దండి సార్! తమిళనాడు రెండేళ్ళుగా యిలాటి వర్షాలకి మొహం వాచిపోయింది. మంచినీటి ఎద్దడితో చచ్చిపోతున్నాం. కురవనివ్వండి సార్! బాగా కురిస్తే పల్లే పట్నం రెండూ సంతోషిస్తాయి" అన్నాడు అతను ఆనందంగా.

తన చిరాకుకి, అతని ఆనందానికి లంగరందదనుకుని "నేను రూములో వుంటాను. మీరు ఫోన్ చేసి ట్రెయిన్ విషయమో, బస్ విషయమో, కనుక్కుని చెపుతారా?" అన్నాడు విజయ్.

'అలాగే సార్' అన్నాడతను వినయంగా.

రూముకు వచ్చి బెడ్‌పై వాలుతూ 'ఇక యిరవై నాలుగు గంటలు మాత్రమే అది దాటిపోతే తను ఇక వెళ్ళటం అనవసరం అనుకున్నాడు.

అతని మనసు మనసులో లేదు. ప్రాణానికి ప్రాణమయిన జగన్నాథం పెళ్ళి ప్రకృతి చూస్తే యిలా వుంది. మనస్సుకే రెక్కలు వుంటే ఎప్పుడెప్పుడు వెళ్ళివాల్దామా అని వుంది కానీ ప్రకృతి మానవుడి కంటే శక్తివంతమైంది.

ఆలోచనలతో మనసు మొద్దుబారి పోయింది.

✧ ✧ ✧

దాదాపు ఎనిమిది గంటల ప్రాంతంలో ఫోన్ చేసి చెప్పాడు మేనేజర్. "రాత్రి

పదింటికి ట్రెయిన్ వుంది. అది వెళుతుందో లేదో ఖచ్చితంగా చెప్పలేమంటున్నారు. వెళ్ళి కూర్చుంటే వెళితే వెళ్ళొచ్చు. ఆరైల్వే స్టేషన్‌కి ఎదురుగ్గా వున్న లాడ్జిదగ్గిర ఓ టూరిస్టు బస్ కూడా తయారుగా వుంది. పాసింజర్స్ నిండితే వెడుతుంది.

ఆ కాస్త ఆశకే అతని మనస్సుకి రెక్కలు వచ్చి. గబగబా సర్దుకుని రూమ్ ఖాళీ చేసి ఆఘమేఘాలమీద ఎగ్మూర్ స్టేషన్ చేరుకున్నాడు. ఎంక్వయిరీస్ వద్దకి వెళ్ళి అడిగితే కౌంటర్‌లో అడగమన్నారు. "చెప్పలేం సార్! అక్కడి నుంచి దారి బావుందని ఫోన్ వస్తే పదకొండుకో పన్నెండుకో బయలుదేరుతుంది" అన్నాడు.

నిట్టూర్చి "అక్కడికి షెడ్యూల్‌గా ఎంతకు చేరుకోవాలి" అని అడిగాడు.

భార్య అనారోగ్యాన్ని గురించి ప్రశ్నవేస్తే వాటికి జవాబు చెప్పే సిద్ధాంతి ధోరణిలో పైకి చూసి తమాషాగా నవ్వి "రైళ్ల రాకడ ప్రాణం పోకడా ఎవరికి తెలుసుసార్?" అని కాసేపు ఆగి "కానీ కనీసం రేపు ఉదయం పది పండ్రెండు గంటలయినా అవుతుంది" అన్నాడు.

హతాశుడయ్యాడు విజయ్.

గాబరాగా ఏమీ తోచని మనస్సుతో అటూ యిటూ పచార్లు చేస్తున్న అతన్ని చూసి ఓ వ్యక్తి వచ్చి "సార్! ట్రెయిన్స్ నమ్ముకుని బాగుపడ్డవాడు లేడు. అందులో యీ హెవీ రెయిన్స్‌లో. మీరు వెళ్ళాలంటే బస్సు తప్ప మరో మార్గం లేదు. అక్కడ ఓ బస్సు వుంది చార్జి పదిహేను రూపాయలు. తెల్లారాక ఓ గంట అటో యిటో మీరు కుంభకోణంలో వుంటారు" అన్నాడు.

ప్రాణాలు లేచి వచ్చాయి విజయ్‌కి.

ఏట్లో మునిగేవాడికి గడ్డిపోచ కూడా ఆధారమయినట్లు మరో ఆలోచన లేకుండా వెళ్ళి కూర్చున్నాడు. బస్సులో పాతిక మంది వున్నారు. అందరి ముఖాల్లో ఆతురత, ఆరాటం.

దాదాపు ఒంటిగంట ప్రాంతంలో బయలుదేరింది బస్.

ఒక విధమయిన ఆనందంతో నిట్టూర్చాడు విజయ్.

"ఎల్లాగయినా పెళ్ళి ముహూర్తం వేళకి తను చేరుకోగలడు. ఇక చింతలేదు." అనుకున్నాడు విజయ్.

ఎవరికి దయ వున్నా లేకపోయినా తను తప్పక దయ తలుస్తుంది అన్నట్టు నిద్రాదేవి అతన్ని కరుణించింది.

హఠాత్తుగా మెళుకువైంగి విజయ్‌కి. చూస్తే ఆరు కావస్తోంది.

ఎందుకో బస్సు ఆగిపోయి వుంది. ఒక్కక్షణంపాటు అయోమయంగా వుందతనికి.

బయట యింకా వరుణుడు కరుణరసాన్ని కురిపిస్తూనే వున్నాడు.

దారిలో బ్రిడ్జి పడిపోయింది. కాలువ వుధృతంగా పారుతోంది. ఎటు చూసినా నీళ్ళే. బస్సు ముందుకి పోలేదు.

అదీ సంగతి!

జలరాశి పొంగినట్లు పారుతోన్న కాలువని చూసి నిస్పృహతో కృంగిపోయాడు విజయ్.

అతని మనస్సు ఆలోచనా శూన్యమయింది. ప్రయాణం ఆగిపోవటం పెళ్ళికి వెళ్ళలేక పోవటం అన్నీ కలిసి మనస్సులో దేవినట్టుగా వుంది అతనికి.

నలభై మంది అడిగే ప్రశ్నలకి జవాబు చెప్పలేకపోతున్నాడు కండక్టర్. అతనకీ సరిగా తెలియటం లేదు ఏదీ.

బస్సు వెనక్కి తిప్పుకుని మైలు దూరంలో వున్న ఓ వూరికి వెళ్ళి మరో మార్గాన కుంభకోణం చేరటానికి వీలవుతుందేమోనని ఫోన్ చెయ్యటానికి వెళ్ళితే సమాధానం చెప్పే నాధుడు కూడా లేదు. అంతలో ఒకటి రెండు స్టేట్ బసెస్ కూడా వచ్చాయి. వాటి గతీ అంతే అయింది.

ఇహ లాభం లేదనుకుని ఎవరి చార్జీ వాళ్ళకి యిచ్చేసి తిరుగు ముఖం పట్టించారు బస్సుని.

పిడుగు పడినా చలించని ధీరుడు విజయ్.

కానీ యీ ప్రయాణంలో యీ నిరాశతో అతని నర నాడులలా కృంగిపోయాయి.

'తన చేతిలో ఏమీ లేదు. ఇహ అంతా దేవుడి మీద వేసి వుండిపోవటం కన్న మరో గత్యంతరం లేదు.' అనుకున్నాడు విజయ్.

సరిగ్గా ముహూర్తం వేళకి మద్రాస్‌లో అడుగు పెట్టాడు విజయ్.

అటు వూర్లో లేక యిటు అనుకున్న చోటూ చేరలేక మధ్యలో నిలిచిపోవడం అతని నిరాశకి అంతులేకపోయింది.

జీవితంలో

"జీవితం చాలా చిత్రమైంది. పరుగెత్తి అందుకుందామని త్వరగా స్వర్గం నుంచి మాధుర్యం దూరమవుతూనే వుంటుంది. అనుకోకుండా కొలు 'కర్మణ్యేవ అధికారస్తే! అమృతం కురిపిస్తుందోసారి, దేనికీ మనుష్యులు ని

అన్నాడు స్పష్టంగా గీతాకారుడు. తర్వాత అంతా విశదంగా జాబు వ్రాయటం

"ఇహ లాభం లేదు. తిర్గిగి వాడి మనస్సుని బాధ పెట్టేందు కన్నా వూరుకోవటం వుత్తమం. ఇప్పుడు టెలిగ్రాఫ్ చేత హింస చాలు" అనుకుని టాక్సీ ఎక్కి లాడ్జి చేరుకున్నాడు

మేలు. తను పడిన

విజయ్.

● దీపావళి ప్రత్యేక సంచిక '73 – జ్యోతి మాస పత్రిక ●